

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త


## నేడు ప్రజల సందర్శన కోసం బిట్రగుంటలో ఆగనున్న వందేభారత్ రైలు

**బిట్రగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ రైల్వే డివిజన్‌లో ఆదివారం నూతనంగా ప్రారంభం కానున్న విజయవాడ–చెన్నై (వయా రేణిగుంట) వందేభారత్ రైలు ప్రజల సందర్శనార్ధం ఆదివారం సాయంత్రం 3.50 గంటలకు బిట్రగుంటలో కొద్దిసేపు నిలుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ కొత్తగా ప్రారంభమయ్యే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుంచి రేణిగుంట, తిరుపతి, కాట్పాడ్ మీదుగా చెన్నై చేరుకుంటుంది. ఈ రైలు జిల్లా ప్రధాన కేంద్రాలలో మాత్రమే ప్రస్తుతం కాల నిర్ణయ పట్టిక ఆధారంగా నిలపనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

## జగనన్న సురక్ష ఏర్పాట్లపై సమీక్ష



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై శనివారం నుడా వైస్ చైర్మన్, కోవూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాపిరెడ్డి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని , వారు దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఈ ఆరోగ్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లు ఏయే ప్రాంతాల్లో కౌంటర్లు ఏర్పాటు చేయాలి.. ఎక్కడ ల్యాబ్ టెస్ట్‌లు చేయాలి.. స్పెషలిస్టు వైద్యులు కొరకు ప్రత్యేక రూములు ఏర్పాటు చేసేలా అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో ఎంపీడీవో శ్రీహరి, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## కోనలో వైభవంగా నృసింహుని నిత్య కళ్యాణం

**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు23 ప్రభాతవార్త**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అబిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మద్య స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రంస్వామి వారిని ప్రత్యేకంగా ఆలంకరించి తిరుచ్చిపై వుంచి బోయిలు మొసుకుంటూ వచ్చి స్వామి వారి సహస్త్ర దీపాలంకరణ మండపంలో వుంచి వేదపండితులు స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఇఓ జనార్ధన్ రెడ్డి, ఇతర అధికారులు పర్యవేక్షించారు.

## ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అమలుపై దృష్టి పెట్టాలి



**నెల్లూరు అర్బన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టి చేతి వృత్తుల వారికి ప్రోత్సాహం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పారిశ్రామిక, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ ఎం.హరినారాయణన్ మాట్లాడుతూ వృత్తి పనిలో నైపుణ్యాన్ని పెంచి వారి ఉత్పత్తులను ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకం అర్హులైన లబ్దిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేదోడు పథకం కింద వృత్తి, చిన్న వ్యాపారాలు చేసుకునే పేదలకు రుణాలు అందిస్తుందన్నారు. పీఎం విశ్వకర్మ పథకం అమలులో లబ్దిదారుల ఎంపికకు డీఆర్‌డీఏ, బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ కార్మిక తదితర శాఖల అధికారులను భాగస్వాములను చేస్తూ ఈ పథకం పటిష్టంగా అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనిపై సమీక్ష చేస్తున్నందున అధికారులు ప్రత్యేక శ్రద్ద వహించాలన్నారు. ఈ పథకంలో వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, చర్మకార్లు, దర్జీలు, చేపలు పట్టేవారు, బుట్టలల్లేవారు తదితర చేతి వృత్తుల వారికిఈ పథకం వల్ల లబ్ది చేకూరుతుందన్నారు. డాక్యుమెంట్ల పేరుతో పేద లబ్దిదారులను బ్యాంకుల చుట్టూ తిప్పుకోకుండా, రుణాలు అందించాలని కలెక్టర్ లీడ్ బ్యాంక్ అధికారికి సూచించారు. లబ్దిదారులకు గ్రామీణ పరిశ్రమలలో బోర్డుపై నమ్మకం పెరిగే విధంగా ఆ శాఖ అధికారులు పని చేయాలన్నారు. బ్యాంకర్లు, ఇండస్ట్రీస్ డిపార్టుమెంట్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి రుణాలు పొందేందుకు వృత్తి పనివారు రుణాలు పొందడానికి అవగాహణ కల్పించాలన్నారు. ఈ పథకంలోశిక్షణ పొందిన వారికి టూల్ కిట్స్ గాను రూ.15000, మొదటి విడతగా లక్ష రూపాయలు రుణం, సకాలంలో తిరిగి చెల్లించిన వారికి రెండు లక్షల రూపాయలు రుణాలుగా ఇవ్వడం జరుగుతుందన్నారు. పరిశ్రమ శాఖ ద్వారా ఏర్పాటు కానున్న బంగారు ఆభరణాల రెడీమేడ్ దుస్తుల, చీరల డిజైనింగ్, నోటు పుస్తకాల తయారీ క్లష్టర్ల ఏర్పాటుకు స్థలాల కోసం ప్రతిపాదనలు పంపితే భూమి కేటాయింపు కోసం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమల శాఖ జాయింట్ డైరక్టర్ సుధాకర్ మాట్లాడుతూ సెప్టెంబరు 17న ప్రధానమంత్రి ఈ పథకాన్ని ప్రారంభించారని, ఈ పథకానికి చేతి వృత్తుల వారు, సాంప్రదాయ వృత్తుల వారు అర్హులని, 18సంవత్సరాలు నిండి ఉండాలని, కుటుంబానికి ఒకరు మాత్రమే అర్హులని, కమిటీ సభ్యులకు వివరించారు. ఈసమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ ఈఈ, సీహెచ్ రాజశేఖర్, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.చందర్, పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వెంకటాచలంలో రాధే కృష్ణ వేడుకులు



**వెంకటాచలం సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** వెంకటాచలంలోని రాధేరాదే కృష్ణ మందిరంలో రాధాకృష్ణ వేడుకులు ఘనంగా నిర్వహించారు.రాదా కృష్ణ విగ్రహలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు.స్వామి వారికి పల్లకిసేవను వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రము ఏర్పాటు చేశారు.అదిక సంఖ్యలో మహిళలు పాల్గోని కర్పూనీరాజనం సమర్పించారు.ఈకార్యక్రములో కమిటి సభ్యులు మనోజ్ గుప్తా,వరదగల్లు హరిబాబు వెంకటరత్నం మందిపాటి రమేష్ చల్లా రమణయ్య శివ అశోక్ తదితరులు పాల్గోన్నారు.

## వైసిపి తీర్ధం పుచ్చుకున్న వవ్వేరు టిడిపి నాయకులు

### -పార్టీలో చేరిన వారికి సముచిత స్దానం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో ని వవ్వేరుగ్రామానికి చెందిన టిడిపి నాయకులు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైసిపి తీర్ధం పుచ్చుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వారిని పార్టీ కండవాకప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాజీ సర్పంచ్ తోనేటి శేఖరయ్య,బట్టాదాసు,తోనేటి దిలీప్, తోనిటి మహిదర్, కొదమల శ్రీకాంత్, కొదమల .శ్రీనివాసులు, చలంచర్ల శేషయ్య, కొదమల గోపాలయ్య, కోటంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, తువ్వర సుదర్శన, ఆత్మకూరు మల్లికార్జున, ఆత్మకూరు.రవి, రాపూరునారాయణ పార్టీలో చేరగా వారిని సాదరంగా ఆహ్వానించారు.వారికి పార్టలో సముచిత స్దానం ఇస్తామని చెప్పారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి,కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నగర పార్టీ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ మోర్ల మురళీ, శనగల శ్రావణ్‌కుమార్, తదితరులున్నారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు చేరువలో ప్రభుత్వ సేవలు



**నెల్లూరు అర్బన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఏపీఎస్ఆర్ఐడీ డైరక్టర్ జే.మురళి జేఏఎస్(ఆర్‌టీడీ), డీపీఓ, స్పెషల్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి, సీఈఓ బి.చిరంజీవితో పంచాయతీ రాజ్ కార్యదర్శుల శిక్షణా తరగతి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ మన జాతి పిత మహత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యంను, మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అతి చేరువలో ప్రభుత్వ సేవలను అందించడం ద్వారా గాంధీజి కలలను వాస్తవ రూపం చేయడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయాలలో పనిచేయుచున్న మీరందరూ, ప్రభుత్వం ద్వారా అందజేసే శిక్షణను క్షుణ్ణంగా అభ్యసించి మీరు పనిచేసే గ్రామాలలోని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని అన్నారు. మీరు పనిని దైవంగా భావించి, మీకు నిర్ధేశించిన విధులను సక్రమంగా నిర్వహించి మన ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలను మెరుగుపరచాలి



**నెల్లూరు అర్బన్, సెప్టెంబరు 23,ప్రభాతవార్త** జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలను విస్తృత స్థాయిలో మెరుగుపరచడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జీజీహెచ్ జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీ ఆసుపత్రులకు చెందిన వైద్యాధికారులతో సమావేశమై, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద జరుగుతున్న వైద్య సేవలు, డెలివరీలపై ఆసుపత్రుల వారిగా సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, అవసరమైన వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. నేడు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎంతో నిపుణులైన వైద్య సిబ్బంది ఉన్నారని ఆయన గుర్తు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్స్‌కు మెరుగైన వైద్య సేవలు అందించి తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు మరింత నమ్మకం కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి పేషెంట్‌కు మెరుగైన వైద్య సేవలను అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి వచ్చే పేషెంట్ వివరాలను రిజిస్ట్రేషన్ నుండి డిశ్చార్ అయి బిల్స్ నమోదు వరకు పేషెంట్ వారీగా స్టేజీ వారీగా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నిర్ధేశించిన గడువులోగా నమోదు పక్రియను పూర్తి చేసేలా సంబంధిత వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీ ఆసుపత్రులకు సంబంధించి పేషెంట్స్ యొక్క ఆన్‌లైన్ నమోదు పక్రియ పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లో పేషెంట్స్ యొక్క ఆన్‌లైన్ నమోదు పక్రియ పట్ల జిల్లా కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు వైద్యం అందించడంలో వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలోని ప్రతి సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌లతో కలెక్టర్ సమీక్ష చేశారు. కోవూరు, వింజమూరు, బుచ్చిరెడ్డిపాలెం తదితర కొన్ని ప్రభుత్వ సీహెచ్‌సీలో ప్రసవాలలోను, వైద్య సేవలు అందించడంలోను మెరుగైన ప్రగతి కనబడిందని, ఈ సందర్భంగా వైద్యులను ప్రత్యేకంగా అభినందిస్తూ జిల్లాలోని ప్రతి సీహెచ్‌సీల్లో ఇదే విధంగా ప్రసవాల, వైద్య సేవల సంఖ్యను పెంచాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులు పెరిగితే తద్వారా ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి నిధులు పెరిగే అవకాశం ఉందని, దాని ద్వారా ఇంకా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అమలు జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమం పురోగతిపై సమీక్షిస్తూ, కంటి వెలుగు కార్యక్రమం కింద పెండింగ్‌లో ఉన్న స్క్రీనింగ్ పక్రియను, శస్త్రచికిత్సలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, జీజీహెచ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్ర శేఖర్, జిల్లా ఆసుపత్రి, ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఘట్టం పూర్తి- మేయర్ స్రవంతి జయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** వినాయక చవితి పండుగను పురష్కరించుకుని నెల్లూరు నగర వ్యాప్తంగా ఉన్న ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు సామూహిక నిమజ్జన ఘట్టాన్ని స్థానిక ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద గల గణేష్ ఘాట్ నందు శనివారం సాయంత్రం వేడుకగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో అతిధిగా నెల్లూరు నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్ల సహాయంతో వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసే ఘట్టాన్ని మేయర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. గణేష్ ఘాట్‌కు భారీ సంఖ్యలో ఊరేగింపుగా వచ్చిన విగ్రహాలకు స్వాగతం పలికి వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

నిమజ్జన ఘట్టం అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్ధప్రసాదాలు అందించి విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు అందరిపై కటాక్షించాలని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ అరుణమ్మ, కమీషనర్ వికాస్ మర్మత్, వైసీపీ నాయకులు, కార్పొరేటర్లు, రంగారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# ఆదాని వరల్డ్ స్కూల్‌లో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే




**ముత్తుకూరు, సెప్టెంబర్23, ప్రభాతవార్త** కృష్ణపట్నంలోని ఆదానీ వరల్డ్ స్కూల్లో శనివారం ఉదయం ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు,వాళ్ల గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపాటల పోటీలలో పిల్లలతో పాటు పెద్దవాళ్లు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సత్యనారాయ సిరియాల మాట్లాడుతూ పెద్దల మాటలు పిల్లలకు బంగారు బాటలని వారి నుంచి మంచి సంస్కృతి సంప్రదాయాలు నేర్చుకోవాలని ముఖ్యంగా చిన్న పిల్లలు వారి ఒడిలో కథలు పాటులు,పద్యాలు నేర్చుకుంటారని తెలియజేశారు.

ప్రతి ఒక్కరి జీవితంలో మరపురాని విషయాలు ఉన్నాయి అంటే అవి చిన్నప్పుడు అమ్మమ్మ,నానమ్మ,తాతయ్య వాళ్ల దగ్గర నేర్చుకున్నవేనని ఎప్పటికి మరిచిపోలేము అని చాలా అనందాన్ని ఇస్తాయని తెలియజేసారు.

విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పెద్దల వేషదారణలో అందరినీ ఆకట్టుకున్నారు. చాలామంది గ్రాండ్స్ పేరెంట్స్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పిల్లలకు పెద్దవాళ్ల గొప్పతనం గురంచి తెలియజేస్తాయని పిల్లలతో కలిసి ఈ రోజు ఇక్కడ వేడుకల్లో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందని తెలియజేస్తూ ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదానీ స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ప్రీ ప్రైమరీ విద్యార్థులు వారి అమ్మమ్మ,నానమ్మ,తాతయ్యలతో పాటుగా ఉపాధ్యాయులు,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష మోడల్ శిబిరాన్ని విజయవంతం చేయాలి



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు గ్రామ పంచాయతీలో ఈ నెల 20వ తేది నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష మోడల్ వైద్య శిబిరాన్ని విజయవంతం చేసేలా గ్రామ సచివాలయ ఉద్యోగులు , ఆరోగ్య సిబ్బంది వలంటీర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి అన్నారు. పడుగుపాడులోని పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఈ శిబిరంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతి వలంటీర్ వారి వారి పరిధిలోని కుటుంబాల్లో వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే ఈ శిబిరంలో ప్రత్యేక వైద్యులచే పరీక్షలు నిర్వహించుకోవాలని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ మంచి అవకాశాన్ని ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినయోగం చేసుకోవాలన్నారు.

ఈ సమీక్షలో ఎంపీడీవో శ్రీహరి, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ రవిబాబు, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పూర్తి



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** వినాయక చవితి పండుగ సందర్భంగా నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనానికి విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలతో నిమజ్జనం జరిగేలా కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేశామని నగర పాలక సంస్థ కమీషనర్ వికాస్ మర్మత్ తెలియజేశారు. స్థానిక ఇరుకళల పరమేశ్వరి ఆలయం సమీపంలోని నిమజ్జనం ఘాట్ వద్ద వసతులను కమీషనర్ శనివారం పర్యవేక్షించారు. కమీషనర్ మాట్లాడుతూ నిమజ్జనం కార్యక్రమం కోసం ఘాట్ వద్ద భారీ క్రేన్‌లు, మర బోట్లు, బారికేడ్ల ఏర్పాటు, రాత్రి పూట లైటింగ్, సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణ, ట్రాఫిక్ కంట్రోల్ నిమిత్తం మైక్ అనౌన్స్‌మెంట్ తదితర వసతులు కల్పించామని తెలిపారు. పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లను కేటాయించి ట్రాక్టర్లు, చెత్త సేకరణ ఆటోలతో ఘాట్ ప్రాంగణం నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. నిమజ్జనం జరిగే చెరువు ప్రాంతంలో ఆకులు, పూలు, ఇతర వ్యర్థాలు వేయకుండా భక్తులకు నిరంతరం సూచనలు చేస్తూ ఉండాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు. ఘాట్ ప్రాంగణం వద్ద అన్నిరక్షణా చర్యలతో పాటు భక్తుల కోసం మంచినీటి సౌకర్యం కల్పించామని కమీషనర్ తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే నిమజ్జన విగ్రహాలను ప్రణాళికబద్ధంగా ఘాట్ ప్రాంతానికి తీసుకొచ్చేలా అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా జాగ్రత్తలు తీసుకుంటామని కమీషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్,స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం




**ఉదయగిరి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** ఉదయగిరి మండలంలోని శ్రీమేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాలలో స్వచ్ఛ భారత్,స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కరుణాసాగర్ మాట్లాడుతు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు ఉదయగిరి వ్యవసాయ కళాశాలలో ఈ ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మనతోపాటు మన పక్కనున్న వారు కూడా ఆరోగ్యంగా ఉండడమే కాకుండా మన అడుగు జాడలలో నడుస్తారని తెలిపారు.ప్రధానమంత్రి పిలుపు మేరకు ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు ఆచారిస్తే భారతదేశం చెత్త రహిత దేశంగా అవతరిస్తుందని విద్యార్దులకు తెలిపారు. విద్యార్దుల చేత జాతీయ సేవా అధికారి డాక్టర్ ఎం కిషన్ తేజ్ మహాత్మాగాంధీ కలలు కన్న స్వచ్ఛభారత్ కలను సాకారం చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో విద్యార్ది కార్యకలాపాల అధికారి డాక్టర్ టి .గోపీకృష్ణా,అధ్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది, విద్యార్దిని, విద్యార్దులు పాల్గోన్నారు.

## పికెపాడు ఎర్రచెరువు వేలంపాట

**అనంతసాగరం,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** అనంతసాగరం మండలం పడమటికంభంపాడు ఎర్రచెరువుకు 29వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరేంద్ర శనివారం తెలిపారు. ఎర్రచెరువులో చేపలు పట్టుకునేందుకు హక్కుకై 1433 పసలి కాలానికి ప్రభుత్వ మద్ధతు ధర 3.50లక్షల రూపాయలు , పాటలో పాల్గొనేవారు డిపాజిట్ 1.75లక్షల రూపాయలు చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 9599824624 నెంబర్‌ను సంప్రదించాచలని ఆయన కోరారు.

## వాలంటీర్ హఠాన్మరణం



**ఆత్మకూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి సచివాలయంలో క్లస్టర్ 13కు వాలంటీర్‌గా పనిచేస్తున్న కళ్ళగుంట ప్రవీణ్‌కుమార్ రాత్రి వారి ఇంటి వద్ద నిద్రిస్తుండగా మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న మున్సిపల్ కమీషనర్ బి.నాగేశ్వరరావ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి.వి.రమణమ్మలు వాలంటీర్ ఇంటికి వెళ్ళి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కమీషనర్ నాగేశ్వరరావ్ ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ప్రభుత్వం నుండి వారికి అందాల్సిన ఆర్థికసహాయం అందేలా చూస్తామన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి వెంట కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు




**ఆత్మకూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** ఆత్మకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం స్థానిక శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు గతంలో తాను చేసిన అవినీతికి సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం అవి రుజువు కావడంతో అరెస్ట్ చేశారన్నారు. అంతేకాని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతో అరెస్ట్ చేయించారనడం సమంజసం కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్ని వర్గాల సంక్షేమం కోసం సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. రెవెన్యూ , హౌసింగ్ సమస్యలతోపాటు ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆత్మకూరు డెవలప్‌మెంట్‌ఫోరం ఏర్పాటు ద్వారా సొంత నిధులతో ఇప్పటికే బస్టాండ్ నిర్మాణం పూర్తిచేశారని అదే విధంగా డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటుతో పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మౌళిక సదుపాయాల కల్పన, విదాయర్థులకు అవసరమైన మౌళి క సదుపాయాలు సాధ్యమైనంతమేర ఆత్మకూరు ను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇలాంటిమంచి మనిషి వెంట నడిచేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు.ఈకార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్స్‌సొసైటీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు బి.రవికుమార్‌రెడ్డి, బి.చిరువెళ్ళ సర్పంచ్ బి.వెంకటేశ్వర్లు యాదవ్ , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేబాలలో మేరిమట్టి, మేరిదేశ్




**బుచ్చి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల గ్రామంలో అజాదికా అమృత్ ఉత్సవాలలో భాగంగా మేరిమట్టి,మేరి దేశ్ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ లఘంతోటి బాగ్యలక్ష్మీ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని ఇండ్లకు వెళ్లి మట్టిని,ధాన్యాన్ని స్వీకరించారు. దీనిని దేశ రాజదానికి పంపనున్నట్లు సెక్రటరీ శ్యామ్ సుందర్ తెలిపారు.ఈకార్యక్రమంలో ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, సచివాలయ కన్వీనర్ హరి ప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి రమణమ్మ, వైసిపి నాయకులు లఘంతోటి మస్తానయ్య, పోసింరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దయాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, టెంకాయల సుధాకర్, టి వెంకటరామిరెడ్డి, ఫయాజ్,సతీష్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది కృష్ణారెడ్డి, నాగసుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## జగనన్న సురక్ష కంటి వైద్య శిబిరం



**ఉలవపాడు,సెప్టెంబర్23,ప్రభాతవార్త** మండలంలోని చాకిచర్ల పెద్దపట్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంటి పరీక్షలు ఈ పథకం ద్వారా నిర్వహించడం జరిగింది.మొత్తం 373 మంది విద్యార్థులతో ఇద్దరు విద్యార్థులకు దృష్టి దోషం ఉందని నిర్ధారణ చేశారు. ఇరువురు విద్యార్థులకు కంటి అద్దాలు 15 రోజుల్లో అందజేస్తామని డాక్టర్ మురళీకృష్ణారెడ్డి తెలియజేశారు.చాకిచర్ల పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్యలక్ష్మి క్యాంపును విజిట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మాధవి,సిహెచ్ ప్రియాంక,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి హెడ్మాస్టర్ సలీంభాషా ఉపాధ్యాయులు సహకరించారు.

## నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి



**వెంకటాచలం సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలోని ఓటర్లను నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచంలోని తహశీల్దార్ కార్యలయంలో సర్వేపల్లి రిట్నరింగ్ అదికారి చిన్న ఓబులేసుకి సర్వేపల్లి నియోజకవర్గంలోని వైసిపి నాయకులు,జిల్లా వైసిపి ఉపాద్యక్షులు మందల వెంకటశేషయ్యతో కలిసి వినతి పత్రం అందజేశారు.అనంతరం అయన మాట్లడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో 11291 ఓట్లను వైయస్ఆర్‌సిపి సానుభూతి పరులు ఓట్లను తోలగించాలని టిడిపి నాయకులు అన్‌లైన్‌లో దరాఖస్తు చేయడం జరిగిందన్నారు.ఓటరు అంగీకారంతో కాకుండా త్రాడ్ పర్సన్‌తో ఓట్లను తీసివేయటం సరికాదన్నారు.బిఎల్‌లు లేకుండా నేరుగా అన్‌లైన్‌లో టిడిపి నాయకులు ఓట్ల తోలిగింపుకు పూనుకోడం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఎంత స్థాయికి దిగాజారడో అర్థమౌవుం దన్నారు.సోమిరెడ్డిని సర్వేపల్లిలో 6 సార్లు ఓడించి బుద్ధిరాలేదని ఈ సారి డిపాజిట్ కూడ లేకుండా ఓడిపోవడం ఖ్యాయం అన్నారు.చంద్రబాబు నాయడుని అరెస్ట్‌కి సర్వేపల్లి నియోజకవర్గంలో నిరసనకు కనీసం నాయకులు లేరురన్నారు.సోమిరెడ్డి ఎన్ని జిమ్ముకుల్లు చేసిన సర్వేపల్లిలో ఓటమి కాయం అన్నారు.ఈకార్యక్రములో ఐదు మండలాలు నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

**సోమిరెడ్డి దళిత ద్రోహి** దళతుల మద్య చించుపెట్టి ఇరు వర్గాలకి తగాదాలు సృష్టించడం సోమిరెడ్డికి వెన్నతో పెట్టిన విద్యని వెంకటాచలం వైసిపి ఎస్సీ నాయకులు కృష్ట నరసయ్య ఆరోపించా రు. వెంకటాచలంలో వైసిపి కార్యలయంలో విలేకర్లు సమావేశము ఏర్పాటు చేసి మాట్లాడారు.సర్వేపల్లి నియోజకవర్గంలో మనుబోలు వెంకటాచలం రెండు ఎంపిపి సీట్లు వెంకటాచలం ఆరుంధీ మహిళకు మనుబోలు హరిజన మహిళకు ఎంపిపి పదవి ఇచ్చన ఘనత మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డికే దక్కిందన్నారు. అభివృద్ధి సంక్షేమా కార్యక్రములు విషయంలో రాజీలేకుండా పేదలకు అందజేస్తున్న కాకాణి గోవర్దన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచారన్నారు.దళితుల కాకాణి గోవర్దన్‌రెడ్డి నామినెడ్ పదవులో సమా న్యాయం కల్పించారన్నారు.

## స్వచ్ఛ లీగ్ 2.0 తో నగర ప్రజలకు మెరుగైన ఆరోగ్యం

### కమీషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి




**బుచ్చి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ పరిధిలోని శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో స్వచ్ఛ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. కమీషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఈకార్యక్రమంలో పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నగర పారిశుద్ధ్యం తద్వారా ప్రజలు ఆరోగ్యం అనే అంశంపై విద్యార్దులకు ఆయన అవగాహన కల్పించారు. చెత్తను మూడు విభాగాలుగా విభజించడం దా ్వరా ప్రజ ల ఆరోగ్యానికి హాని కలగకుండా నివారించే విషయాలను ఆయన విద్యార్దులకు తెలియజేశారు. ప్రతి ఇంటికి నగర పంచాయితీ తడిచెత్త,పొడిచెత్త, ప్రమాదకర చెత్తను వేసుకునేందుకు విడివిడిగా డస్టు బిన్లు అందజే స్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కూరగాయల వ్యర్దాలు తడి చెత్తగా, ప్లాస్టిక్ కవర్లు ,మరియు బిస్కెట్ ప్యాకెట్లు లాంటివి పొడిచెత్తగా,సిరంజ్ నీడిల్స్ రక్తం తడిచిన దూది లాంటివి ప్రమాదకర చెత్తగా భావించాలని విద్యార్దులకు తెలియజేశారు. విద్యార్ది దశ నుండే స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమంపైన అవగాహన కలిగి ఉండడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా మారి ప్రజల ఆరోగ్యం మెరుగుగా ఉంటుందని ఆయన తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్దులు మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గోన్నారు.

## పసుపులేటి సుధాకర్‌కు సంఘీభావం తెలిపిన డాక్టర్ నాయుడు

**కావలి రూరల్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ కావలి పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్, ప్రజా వైద్యులు డాక్టర్ ఎన్.ప్రభాకర్‌నాయుడు నల్లదుస్తులతో పాల్గొని నిరసన తెలియజేస్తూ పసుపులేటికి సంఘీభావం తెలిపారు.

## దుర్మార్గులు ఎన్ని జన్మలెత్తినా చంద్రబాబుకు మచ్చతేలేరు




**కావలి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** దుర్మార్గులు ఎన్ని జన్మలెత్తినా చంద్రబాబునాయుడుకు మచ్చతేలేరని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు హెచ్చరించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ మాలేపాటి ఆధ్వర్యంలో కావలి టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన రిలేనిరాహారదీక్షలు శనివారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి.ఈ దీక్షలో కావలి నియోజకవర్గంలోని ఎస్సీ,ఎస్టీ నాయకులు, ఎస్సీ,ఎస్టీ విభాగం సభ్యులతో కలిసి మాలేపాటి కూర్చున్నారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడారు. నారా చంద్రబాబునాయుడుపై కుట్ర విషయంలో అంతిమ విజయం న్యాయం వైపే వుంటుందన్నారు. చంద్రబాబునాయుడిని రాజకీయ కక్షతో అరెస్ట్ చేశారా లేదా అన్న విషయాన్ని చిన్న పిల్లలను అడిగినా చెబుతారని తెలిపారు. చంద్రబాబు ఏ తప్పు చేయలేదు కాబట్టే దేశ, విదేశాలలో సైతం ఆయనకు రోజురోజుకు మద్దతు పెరుగుతోందన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి తరిమికొట్టకపోతే రాష్ట్రం అంధకారమవుతుందన్నారు. దగదర్తిలో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై సహించలేని గ్రామస్తులు కోర్టుకు పిల్ రూపంలో సమర్పించారన్నారు.హైకోర్టు నుండి రెవెన్యూ, మైనింగ్ శాఖలకు ఈ రోజు ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఈ అక్రమ గ్రావెల్ విషయం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నాకు తెలియదంటూ చెప్పడం విడ్డూరంగా వుందని తెలిపారు. అందరి బండారాలు బయటపెట్టి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దోషులందరిని జైలుకు పంపించడం ఖాయమని హెచ్చరికలు చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచకాలు, వైసిపి నేతలు ఎస్సీ,ఎస్టీలపై చేస్తున్న అక్రమ దాడులపై తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రచారంచేయాలని మాలేపాటి పిలుపునిచ్చారు.టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శిక్షణ పొందిన వారికి సర్టిఫికేట్లు పంపిణీ



**వింజమూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** వింజమూరులో శ్రీచైనత్య టెక్నో స్కూల్ సమీపంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృత్తి విదా ్య శిక్షణా కేంద్రం లో శిక్షణ పొందిన వారికి శనివారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు , ఉదయగిరి టిడిపి నాయకులు కాకర్ల సురేష్ మహిళలకు సర్టిఫికేట్లు అందజేశారు . శనివారం స్థానిక శిక్షణా కేంద్రంలో శిక్షణను పూర్తిచేసుకున్న మహిళలకు తమ ట్రస్ట్ భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులు పూర్తి చేసినవారు స్వయం శక్తితో అభివృద్ధి చెందాలన్నారు.ఈకార్యక్రమంలో కాకర్ల సురేష్ సతీమణి లక్ష్మీప్రవీణ, సిఇఒ కాకర్ల వెంకట్, సభ్యులు మన్నెం మధురెడ్డి, కోనేటి మార్కోండేయులు , తుమ్మల కిరణ్, మేదరమెట్ల వెంకటేశ్వర్లు, గానుగపెంట నరేంద్ర, బయపురెడ్డి రవిశంకర్‌రెడ్డి, వృత్తివిద్యాకోర్సుల ఇన్‌చార్జ్ మేకల అనీల, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## బొల్లినేని విమర్శించే స్థాయి వైసిపి నేతలకు లేదు



**వింజమూరు, సెప్టెంబర్23,ప్రభాతవార్త:** ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును విమర్శించే స్థాయి వైసిపి నేతలకు లేదని మండల టిడిపి ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులుయాదవ్, మండల ఉపాధ్యక్షుడు గురజాల వాసునాయుడు, పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసిపి నేతలు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడిని తీరు కళ్ళు ఉండి బొల్లినేని చేసిన అభివృద్ధిని చూడలేని కబోదిలా ఉందన్నారు. ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందిందంటే అది బొల్లినేని హయాంలోనేనన్నారు. నేటికీ బొల్లినేని చేసిన అభివృద్ధికి సాక్ష్యంగా ఎన్నో పనులు కన్పిస్తుంటాయన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి టిడిపిలోకి వచ్చినంత మాత్రాన తమపార్టీకి వచ్చే లాభం ఏమీ లేదన్నారు. చంద్రబా బునాయుడుమీద స్కిల్‌డెవలప్‌మెంట్ కేసు పెట్టి విమర్శలు చేస్తున్న వైకాపా నాయకులు చంద్రబాబు అవినీతిని నిరూపించగలరా అని సవాల్ విసిరారు.నిన్న మొన్నటి వరకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపక్కనే తిరిగి విమర్శలు చేస్తున్న వైకాపా నాయకులకు చిత్తశుద్ది లేదన్నారు. మేకపాటిని, బొల్లినేని ఒకే గాట కట్టేయడం సరికాదన్నారు. చాకలికొండకు చెందిన సొసైటీ డైరెక్టర్ పోలుబోయిన వెంకటేశ్వర్లు తన స్థాయి మరచి బొల్లినేని పై అవాకులు, చవాకులు మాట్లాడడం తగదన్నారు. పోలుబోయిన సోదరుడు తెలుగుదేశంపార్టీ నాయకుడిగా గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసి అభ్యర్థిగా గెలుపొంది చేసిన అభివృద్ధిని తన గ్రామంలోనే సొసైటీ డైరెక్టర్ చూడవచ్చన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఉదయగిరి కోటపై టిడిపి జెండా ఎగురుతుందన్నారు. ఈకార్యక్రమంలో ముస్లింమైనార్టీ నాయకులు షేక్ మహబూబ్‌బాషా, మాజీ వార్డుసభ్యులు బాదుల్లా , రైతు సంఘ అధ్యక్షుడు ఏగినేని శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ సభ్యత్వ నమోదు



**వింజమూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ వింజ మూరు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం యుటిఎఫ్ నేతలు వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షుడు వి.శివకోటారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్య లపట్ల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు పేరం మల్లిఖారు ్జన, ధర్మపురి ప్రసాద్, మద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, కొండారెడ్డి, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## 1.25లక్షల రూపాయల పలికిన వినాయక లడ్డు



**వింజమూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** వింజమూరులోని యాదవ వీధిలో వినాయకచవితి సందర్భంగా వినాయకునివద్ద ఉంచిన లడ్డు వేలంపాటలో శ్రీకర్ల వెంకటప్రసాద్ యాదవ్ 1.25లక్షల రూపాయలు పాట పాడి లడ్డును కైవసం చేసుకున్నాడు. ప్రతి ఏడాది యాదవబజార్‌లో ఏర్పాటు చేస్తున్న వినాయకుడి వద్ద నిర్వాహక కమిటీ సభ్యులు, ఆప్రాంత వాసులు స్వామివారి లడ్డును కైవసం చేసుకునేందుకు పోటాపోటీగా వేలంపాటలో పాల్గొంటారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## పశు విజ్ఞానబడి అవగాహనా సదస్సు




**వింజమూరు,సెప్టెంబర్23,ప్రభాతవార్త:** వింజమూరు మండలంలోని తమిదపాడు పశు వైద్య కేంద్ర పరిధిలో ఉన్న ఆరవీటికిస్తీపురంలో శనివారం చాకలికొండ పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావ్ ఆధ్వర్యంలో పశుపోషకులకు పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుపోషకులు పాటించాల్సిన మెళుకువల గురించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందస్తుగా పశువులకు వ్యాధులు రాకుండా ఉండేందుకు నివారణా టీకాలు, అత్యవసర పశువైద్యం కోసం 24 గంటలు పనిచేసే 1962 అంబులెన్స్ సేవల గురించి తెలిపారు. పశుగ్రాసం కత్తిరించే యంత్రాల సబ్సిడీ గురించి వివరించారు. అనంతరం పశువైద్యశిబిరం నిర్వహించి జీవాలకు నట్టల నివారణా మందును తాగించారు. గొంతువాపు వ్యాధి నివారణా టీకాలను వేశారు. పశువులకు వచ్చే పొదుగువాపు వ్యాధినివారణా టీకాలు అందించారు.ఈకార్యక్రమంలో పశువైద్య సహాయకులు హజరత్తయ్య, సిబ్బంది భార్గవ్, మహేష్ , కృష్ణ , రైతులు పాల్గొన్నారు.

## చౌకదుకాణాల తనిఖీ

**రాపూరు,సెప్టంబరు23ప్రబాతవార్త** రాపూరు మండలంలోని చౌకదుకాణాలకు చెందిన ఎలాక్ట్రానిక కాటాలను శనివారం జిల్లా తూనికల కోలతల ఇనస్పెక్టర్ సాయి శ్రీకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక్కసారి తప్పని సరిగా చౌకదుకాణాల కాటాలకు అధికారుల ద్వారా సీల్ వేయించుకోవాలన్నారు. దీంతో పాటు జిల్లాలోని అందరూ వ్యాపారస్తులు సైతం వారి,వారి కాటాలకు, తూకం రాళ్లకు తమ శాఖ ద్వారా తనిఖీలు నిర్వహించుకోని తమ ద్వారా సీల్, ముద్రలు వేయించుకోవాలన్నారు. లేని పక్షంలో వారిపై కేసులు నమొదు చేయడం జరుగుతుందని తెలిపారు. రాపూరు మండలంలో 47 చౌకదుకాణాలకు సంబందించిన ఏలక్ట్రానిక్ కాటాలను పరిశీలించి సీల్ వేయడం జరిగిందని తెలిపారు.

## రాపూరులో వైభవంగా గణనాదుని గ్రామోత్సవం

**రాపూరు,సెప్టంబరు23ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు శివాలయంలో ఏర్పాటు చేసిన గణనాధుని గ్రామోత్సవం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గణనాధుని భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై వుంచి పలు రకాలైన పుష్పాలతో శోభాయమానంగా ఆలంకరించారు.అనంతరం స్వామి వారి చేతిలోని లడ్డుకు పాట నిర్వహించగా స్వామి భక్తుడు శ్రావణ్ రూ. 1 లక్షా 3 వేల రూపాయిల అత్యధిక మొత్తానికి పాట పాడి లడ్డును సోంతం చేసుకున్నాడు. స్వామి వారి విగ్రహన్ని గ్రామంలోని విధులలో తిప్పి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం సందర్బంగా 28 మంది కేరళాకు చెందిన వాయిద్య బృంద సభ్యులు చేసిన కేరళా వాయిద్యాల మోతలు భక్తులను విశేషంగా అకట్టుకున్నాయి. తదుపరి స్వామి వారి విగ్రహాన్ని తెలుగుగంగ కాలువలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయం భక్తజన బృందం పాల్గోన్నారు.

## ప్రజా ఆరోగ్య పరిరక్షణకే జగనన్న ఆరోగ్య సురక్ష



**రాపూరు,సెప్టంబరు23ప్రబాతవార్త** రాష్టంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు రాపూరు యంపీడీఓ అప్పాజీ తెలిపారు. శనివారం రాపూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో రాపూరు బిట్ 1 సచివాలయం పరిధిలోని వాలంటీర్లు ఆరోగ్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్బగా ఆయన మాట్లాడుతూ రాపూరు బిట్ 1 సచివాలయం పరిధిలో అక్టోబరు 16వ తేది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం సచివాలయం పరిధిలోని వాలంటీర్లు వారి పరిధిలోని గృహాలను సందర్శించి వారి ఆరోగ్య వివరాలు నమొదు చేయాలన్నారు.ప్రతి వాలంటీరు తప్పని సరిగా ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాపూరు పంచాయితీ విస్తరణాధికారి శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్ లింగమూర్తి,ఆరోగ్య కార్యకర్తలు కాంతమ్మ, హరిత, ఇతర వైద్యసిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గోన్నారు.

## నేడు వెంకటగిరిలో రాపూరు మండల వైసిపి నేతల సమావేశం

**రాపూరు,సెప్టంబరు23ప్రభాతవార్త** వైసిపి నాయకులకు ఆదివారం వెంకట గిరి లోని నేదురుమల్లి భవన్‌లో సమావేశంనిర్వహిస్తున్నట్లు మండల వైసిపి ఆధ్యక్షుడు పాపకన్ను దయాకర్ రెడ్డి శనివారం తెలిపారు.ఈ సమావేశంలో మండలంలోపార్టీ బలోపేతం కోరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వెంకటగిరి నియోజకవర్గ సమ న్వయకర్త నేదురుమల్లి రాంకుమర్ రెడ్డి నాయకులకు దిశా నిర్ధేశం చేస్తారన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అందరూ సర్పంచ్‌లు, యంపీటీసిలు, పార్టీ ముఖ్య నాయకులు, సచివాలయం కన్వినర్‌లు, గృహసారధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్



**బిట్రగుంట, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నా భూమి...నా దేశం కార్యక్రమం కింద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పాల్గొని విద్యార్థుల చేత స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ప్రతి విద్యార్థి చేత మట్టిని సేకరించడం, కళాశాల ప్రాంగణాన్ని శుభ్రపర్చడంలో అవగాహన కల్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా నా మట్టి, నా దేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న దేశంగా భారతదేశం అభివృద్ధి చెందాలంటే దేశాభివృద్ధితో పాటు ప్రతి ఒక్కరు స్వచ్ఛభారత్, గాంధీ సూత్రాలైన అహింస, శాంతికి కట్టుబడి వుండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల ప్రజల ఆకలి తీర్చిన కర్నాటి దంపతులు



**కావలి రూరల్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో శనివారం కావలి సమీపంలోని బుడమగుంట గిరిజన ప్రాంతంలోని పేదలకు కావలి ఏరియా వైద్యశాల నోడల్ అధికారి డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ కర్నాటి నాగభార్గవి దంపతుల కుమారుడు కర్నాటి అనురాగ్‌వైద్య 3వ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సభ్యులు యం.అజిత్‌బాబు, వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషాలు మాట్లాడారు. దాతలు డాక్టర్ కర్నాటి రోహిత్, డాక్టర్ నాగభార్గవి దంపతుల కుమారుడు అనురాగ్‌వైద్య పుట్టిన రోజు పేదల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. గత పుట్టిన రోజులు కూడా గిరిజన పిల్లల మధ్య జరుపుకోవడం జరిగిందన్నారు. డాక్టర్ కర్నాటి రోహిత్ కరోనా సమయంలో చేసిన సేవలు అభినందనీయమన్నారు. అనురాగ్‌వైద్యకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్లు కర్నాటి రోహిత్, నాగభార్గవి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి చదివింపుల డబ్బులతో అన్నదానం నిర్వహించిన వధూవరులు



**కావలి రూరల్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** అద్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్వి ఫౌండేషన్ సభ్యులు ఉప్పుటూరి బ్రహ్మయ్య, శ్రీలక్ష్మిల వివాహానికి వచ్చిన చదివింపుల డబ్బులతో నార్తురాజుపాళెం వద్ద గల విశ్వజనని బాలల ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు బెజవాడ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కొత్త ఆలోచనతో ఉప్పుటూరి బ్రహ్మయ్య, శ్రీలక్ష్మిలు పెళ్లికి వచ్చిన చదివింపులతో అనాథ పిల్లలను ఆదుకోవడం ఒక మంచి నిర్ణయమని తెలిపారు. అంతేకాకుండా 22 వేల రూపాయల ఇన్వర్టర్‌ను కూడా అనాథ ఆశ్రమానికి వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అద్వి ఫౌండేషన్ సభ్యులు లోకేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు వేగవంతం కావాలి



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా మంజూరైన పనులు మరింత వేగవంతం కావాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ అన్నారు. కోవూరులోని డీఈ కార్యాలయంలో శనివారం ఆయన కోవూరు సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల ఏఈలతో ఈ పనులకు సంబంధించి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం సబ్‌డివిజన్ పరిధిలో 216 పనులు మంజూరు కాగా.. ఇప్పటివరకు 156 పనులు పూర్తికావడం జరిగిందన్నారు. మిగిలిన పనులు కూడా అక్టోబర్ నెలాఖరులోగా నూరుశాతం పూర్తికావాలన్నారు. చేపట్టే పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి అన్నారు. ఈ సమీక్షలో ఐదు మండలాలకు సంబంధించిన ఏఈలు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై రైతుల్లో అవగాహన పెంచాలి



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న పశు సహాయకులు వారి వారి పరిధిలో ఉన్న పాడి రైతులకు సీజనల్‌లో వచ్చే వ్యాధులపై మరింత అవగాహన కల్పించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం రైతుభరోసా కేంద్రంలో శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డు రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రానికి పాడి పశువులకు సంబంధించిన మందులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా రైతులు తమ పాడి పశువులకు సంబంధించి ఏమైనా అత్యవసర సమస్యలు ఏర్పడితే అంబులెన్స్ సేవలు కూడా వారు సద్వినియోగం చేసుకునేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

## పాటూరులో గణేషుని గ్రామోత్సవం



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** మండలం పాటూరు పంచాయతీ పరిధిలోని కామాక్షమ్మ కాలనీలో శనివారం గణేషుని గ్రామోత్సవ కార్యక్రమాలు అత్యంత వేడుకగా కన్నులపండువగా నిర్వహించారు. ముందుగా సాంప్రదాయబద్ధంగా స్వామివారిని వాహనంపై నిలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ గ్రామోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా శివకుమార్, కిరణ్, శివయ్య, శ్రీకాంత్, ప్రశాంత్, కేతా మల్లికార్జున, ఆనంద్, ఏడుకొండలు, సురేష్‌లు వ్యవహరించారు.

## మన మట్టి - మన కార్యక్రమం విజయవంతం చేయాలి



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మన మట్టి-మన కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు విజయవంతం చేసేలా ఎంపీడీవో శ్రీహరి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ , సచివాలయ కార్యదర్శులు ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరించి ఆ మట్టిని మండల పరిషత్ కార్యాలయానికి అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా అన్ని పంచాయతీల్లో ఇంటి పన్నులు , కుళాయి పన్నులు ఇతరత్రా వంటివి డిజిటల్ పేమెంట్ ద్వారా వసూలు చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఈ డిజిటల్ పేమెంట్‌పై సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలు కూడా పంచాయతీకి చెల్లించే ఇంటి పన్నులు, కుళాయి పన్నులు డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ, తదితరుల ఉన్నారు.

## గీతాంజలిలో మెగా వైద్య శిబిరం



**కోవూరు, సెప్టెంబరు 23 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరం శనివారం ముగిసింది. ఈ శిబిరంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సంధ్య రెడ్డి, సింహపురి దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ పి. శ్రీనివాసులురెడ్డి, మంజీరా ఆస్పత్రి చర్మ వైద్య నిపుణులు డాక్టర్ మంజీరా ఆధ్వర్యంలో అధ్యాపకులు , విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ మాట్లాడు తూ తమ కళాశాలలో విద్యార్థులకు కేవలం చదువే కాకుండా సామాజిక ఆరోగ్య పరీక్షలపై కూడా వారికి అవగాహన కల్పించేలా ఇటువంటి శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో వైద్యులు ఇచ్చిన సలహాలు, సూచనలను అధ్యాపకులు, విద్యార్థులు తప్పక పాటించాలన్నారు. అనంతరం వైద్యులను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి వై. మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి



**కావలి రూరల్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కావలి జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు తెలిపారు. కావలి ఎంపిడివో కార్యాలయంలో కావలి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిపి ఆలూరి కొండమ్మ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఈ మూడు నెలల కాలంలో శాఖల పరంగా సంబంధిత అధికారులు సాధించిన ప్రగతి గురించి, సాధించాల్సిన ప్రగతి గురించి వివరించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు తెలియజేశారు. ఎంపిటిసిలు, సర్పంచ్‌లు వారి గ్రామ పంచాయతీలలో కావాల్సిన పనుల గురించి, సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం, హౌసింగ్,జగనన్న ఆరోగ్య సురక్ష, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఎన్నో సమస్యలు వుంటాయని మండల సర్వసభ్య సమావేశంలో సమస్యలు చెప్పుకోవడానికి వస్తారని సంబంధిత అధికారులు లేకపోతే సమస్యలు ఎవరికి చెబుతారని ప్రశ్నించారు. అందువల్ల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి మండలంలోని పలు సమస్యలపై అసెంబ్లీలో కూడా చర్చించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరుగుతుందని తెలిపారు. అధికారులు ప్రజల సమస్యలు తీరుస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి, సియం జగన్మోహన్‌రెడ్డిలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.ఈ సమావేశంలో ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, మండల ప్రత్యేకాధికారి రమేష్‌నాయక్, ఎంపిడివో ఎ.వి.కృష్ణమోహన్‌రావు, వైస్ ఎంపిపి రాజయ్య, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కచ్చేరిమిట్టలో ఘనంగా జరుగుతున్న గణేష్ ఉత్సవాలు



**కావలి రూరల్, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** కావలి పట్టణ కచ్చేరిమిట్టలో కృష్ణ బలిజ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు 9 రోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేసిన గణనాథుడు అందరిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాడు. గణేష్ మండపం, పరిసర ప్రాంతమంతా ప్రత్యేకమైన సెట్టింగ్‌తో విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం ఉత్సవాల 6వ రోజు అన్నప్రసాద దాతలు కందుల అన్వేష్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, సూరగాని రమేష్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు కావేటి చిన్నకోటయ్య పర్యవేక్షణలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎయంసి చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు గుత్తికొండ కిషోర్‌బాబు, మంచాల ప్రసాద్, తటవర్తి వాసు, ఆత్మకూరి నాగరాజు, కావేటి శివ, ఇట్టు, కృష్ణ బలిజ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిప్పుతో పెట్టుకున్నావ్ మసైపోతావ్

**నెల్లూరు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** నిప్పులాంటి చంద్రబాబునాయుడుతో పెట్టుకున్న వాళ్ళంతా కనుమరుగు అయ్యారని, నిప్పుతో పెట్టుకున్న వారేవరూ ఇప్పటి వరకు బతికి బట్టకట్టలేదని జగన్ కూడా మాడి మసైపోతాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో మాజీమంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు చంద్రబాబు అక్రమ అరెస్టుకి నిరసనగా టీడీపీ నేతలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 11వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ దేశమంతా అభిమానులు ఉన్న చంద్రబాబును జైలులో పెట్టి జగన్ తప్పు చేశాడన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారు చంద్రబాబు అరెస్టుకి నిరసనగా రోడ్డు మీదకి వచ్చి చేస్తున్న ఆందోళనలు జగన్‌కి కనిపించడంలేదాని ప్రశ్నించారు. జైలులో బాబుకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైసీపీని బంగాళాఖాతంలో కలపనున్నారన్నారు. ఈ దీక్షలో మాజీమంత్రి రమేష్‌రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు, ధర్మవరం సుబ్బారావు, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల విజేతరెడ్డి, తాళ్లపాక అనూరాధ, నగర అధ్యక్షుడు మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, పనబాక భూలక్ష్మి, కప్పిర రేవతి, జిల్లా అధికార ప్రతినిధి కువ్వారపు బాలాజీ, అన్నంగి ప్రసాద్, డాక్టర్ ధర్మవరం గణేష్‌కుమార్, కాకర్ల తిరుమలనాయుడు, హరిబాబు, బివి లక్ష్మి, పొత్తూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## దౌర్జన్యాలతో కొద్ది రోజులే రాజకీయాలు సాగుతాయి



**నెల్లూరు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** అక్రమ అరెస్టులు, వేధింపులు, నిర్భంధాలు, లాఠీలు, దౌర్జన్యాలతో ఎవరు కూడా ఎక్కువ రోజులు రాజకీయాలు చేయలేరని, అలాంటివి కొద్దిరోజులు మాత్రమే చెల్లుబాటు అవుతాయని తెలుగుదేశం పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా 11వ రోజు నాయీబ్రాహ్మణుల వాయిద్యాలతో నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న వ్యక్తులు ప్రజలకు మేలు చేస్తే వారు హర్షిస్తారని శ్రీధర్‌రెడ్డి అన్నారు. అధికారంలో ఉన్న వారు ప్రజలను వేధింపులకు గురిచేస్తే ప్రజల్లో తిరుగుబాటు మొదలు అవుతుందని దానిని తట్టుకోవడం ఎవరి వల్లా కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి జన్ని రమణయ్య, రాష్ట్ర పరిశీలకులు దొడ్డపనేని రాజానాయుడు, జిల్లా అధికార ప్రతినిధి పఠాన్ సాబిర్‌ఖాన్, కార్యదర్శి ఈదర శ్రీనివాసులు, చేజర్ల మహేష్, మన్నెం పెంచలనాయుడు, సారంగం గున్నయ్య, కే సాయిబాబా, అల్లాబక్షు, ఎం రఘు, ఊరందూరు సురేంద్రబాబు, కనపర్తి గంగాధర్, అరవ శ్రీనివాసులు, షంషుద్దీన్, ఎన్ మదన్‌కుమార్‌రెడ్డి, వి సురేంద్రయాదవ్, వి రమేష్‌చౌదరి, ఉప్పల వెంకటేశ్వర్లు, గుంటగాని అశోక్, గజరా నరేష్, హరిప్రసాద్, మాసా శ్రీనివాసులు, కుమార్ హరికుమార్, హృదయ్ కుమార్, గుంజి శ్రీధర్, రూపక్ పరదేశి, సింహాచలం, భాస్కర్‌రెడ్డి, ఖాదర్‌భాష, అంకోష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆధారాలు లేకుండా చంద్రబాబు అరెస్టు దుర్మార్గం



**నెల్లూరు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** ఎన్నో కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న సీఎం జగన్, అవినాష్‌రెడ్డిలకి సంబంధించిన ఆధారాలు ఎన్నో ఉన్నా వారి ఇప్పటి వరకు అరెస్టు చేయకుండా ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడకుండా ఎలాంటి అధారాలు కూడా లేకుండా ఉన్న నారా చంద్రబాబునాయుడుని అరెస్టు దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు మండిపడ్డారు. శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో చంద్రబాబుకు మద్ధతుగా సుబ్బారావు ఉద్యమాన్ని చేపట్టి, ప్రజల దగ్గర నుంచి ఉత్తరాలను సేకరించి వాటిని కలెక్టర్ కార్యాలయం సమీపాన ఉన్న పోస్టు బాక్సులోవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు మద్ధతుగా ఇక్కడ నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పోస్టు కార్డులను రాజమహేంద్రవరానికి పంపుతున్నారన్నారు. ప్రజలందరూ చంద్రబాబు అరెస్టును ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు. రానున్న 2024లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు రాజకీయ సమాధి కట్టనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ ఉత్తరాల ఉద్యమంలో నాయకులు డాక్టర్ గణేష్‌కుమార్, కేసీ భాస్కర్, షేక్ అబ్దుల్‌ఎజాజ్, కె సుధాకర్, సాయిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న నిమ్మలపల్లివారి విఘ్నేశ్వరుడు



**జలదంకి, సెప్టంబర్23, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన జలదంకి నిమ్మలపల్లి శ్రీనివాసులు వారి బృందం ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి విగ్రహం వద్ద భక్తిభావం ఉట్టిపడుతుంది.ప్రతిఏడాది ఎంతో ప్రత్యేకతను చాటుకుంటున్న ఇక్కడి గణేష్ ప్రతిమవద్ద ఏడురోజులు ఉత్సవాలు చేపట్టడం ఆనవాయితి.ప్రతిరోజు పూజలు ,తీర్ధప్రసాదాల స్వీకరణ, భజనలు ఇతరత్రా కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఆక్రమంలోనే ప్రస్తుత వేడుకలు అలరిస్తున్నాయి.శనివారం భారీ అన్నదానం కార్యక్రమం చేపట్టి నిర్వాహకులు నిమ్మలపల్లి రామచైతన్య,వారి మిత్రబృందం ఓరా అనిపించారు.ఈకార్యక్రమంలో గ్రామం మొత్త చిన్నాపెద్దా పాల్గొనడం విశేషం.క్రమశిక్షణ,నిర్వహణా చాతుర్యవంటివి ఇక్కడ ప్రత్యేకతంటు అందరు శ్లాఘించడం కనిపించింది.నిమజ్జనం రోజున ఉదయంనుంచే ఉట్టికొట్టడంనుంచి,లడ్డూవలేంపాటవరకు అంతా ప్రత్యేకంగానే సాగుతుందిన పలువురు మెచ్చుకుంటుండడం గమనార్హం.

## చంద్రబాబుకు మద్దతుగా దీక్ష



**వరికుంటపాడు, సెప్టంబర్23, ప్రభాత వార్త:** తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్య క్షుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగ చేప ట్టిన నిరాహార దీక్షల్లో వరికుంటపాడు ఎస్.సి సెల్‌నేతలు సంఘీబావాన్ని తెలిపారు.కలిగిరిలో జరుగుతున్న 11వ రోజు రిలే నిరాహారదీక్షలలో టి.డి.పి పార్లమెంటు అద్యక్షుడు కాకి ప్రసాద్ అద్వర్యంలో మండల ఎస్.సిసెల్ అద్యక్షుడు తాతపూడి లాబాన్,మాజీ ఎం.పి.టి.సి సభ్యుడు నందిపాటి ఆరోన్‌లు పాల్గొని దీక్షలో భాగస్వాములయ్యారు.ఈసందర్బంగ లాబాన్ మాట్లాడుతు బాబుకు తోడుగ నియంతపై పోరాటంచేసేందుకు సిద్ధమని రానున్న ఎన్నికల్లో దౌర్జన్యపాలనకు చరమగీతం పాడతారన్నా రు.72 సంవ త్సరాల మాజీ ముఖ్యమంత్రి అవినీతి మచ్చలేని నాయకుడు చంద్ర బాబునాయుడ్ని అక్రమంగ అరెస్ట్‌చేయడం సిగ్గుచేటన్నారు.జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయకక్షతోనే చంద్రబాబును అరెస్ట్ చేయించారని మండిపడ్డారు.ఈకార్యక్రమంలో నాయకులు వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా ఇళ్ళనిర్మాణాలు పూర్తిచేయాలి



**వరికుంటపాడు, సెప్టంబర్23, ప్రభాతవార్త:** జగనన్న లేఔట్లలో గృహనిర్మాణాలను వేగవంతంగ పూర్తిచేయాలని ఎం.పి.డి.ఒ చేవూరి శ్రీదేవి అన్నారు.మండలంలోని హుస్సేన్‌నగర్‌లో శనివారం జగనన్న లేఔట్టను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు.ప్రభుత్వ నిభందనల మేరకు నిర్మాణాలు చేపట్టి పూర్తిచేయాలన్నారు.అనంతరం జగనన్న ఆరోగ్యసురక్షా కార్యక్రమంపై తిమ్మారెడ్డిపల్లి సచివాలయంలో సచివాలయ సిబ్బంది,గ్రామ వాలంటీర్లతో సమీక్షాసమావేశం నిర్వహించారు.అ అక్షరచైతన్యం పరీక్షను పక్కాగ నిర్వమించండి...అక్షరచైతన్యం రెండవవిడత సంబందించి పరీక్ష ఆదివారం మండలంలో 16 కేంద్రాలలో నిర్వహించనున్నారని ఈపరీక్షకు 283మంది వయోజన అభ్యాసకులు హాజరకానున్నారని అందుకు సంబందించి ఇన్విజిలేటర్లు పక్కాగ మసలుకోవాలని ఎం.పి.డి.ఒ శ్రీదేవి అన్నారు.శనివారం స్తానిక ఎం.పి.డి.ఒ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఆయాకార్యక్రమాలలో హౌసింగ్ ఎ.ఇ ఎఫ్రాయిం,వర్కిన్‌స్పెక్టర్ నాయబరసూల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌స్కూల్‌కి అమరావతి విద్యార్థి ఎంపిక



**పొదలకూరు సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** రా ష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ కడప నందు అడ్మిషన్ కొరకు మండలస్థాయి,జిల్లా స్థాయి లో జరిగిన పోటీలలో నెల్లూరు జిల్లా నుండి బాలుర విభాగంలో ఎంపికైన పట్టణంలో ఉండే అమరావతి స్కూల్ విద్యార్థి గుంటి.లీలాగౌతమ్ ఎంపికైనట్లు స్కూల్ యాజమాన్యం పేర్కొనింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.సురేష్ మాట్లాడుతు జిల్లా స్థాయిలో బాలురకి 20 సీట్లు మాత్రమే కేటాయించగా అందులో మండలస్థాయిలోను జిల్లా స్థాయిలోను ఎక్కడ చూసిన పొదలకూరు పట్టణంలో ఒక్క అమరావతి స్కూల్ విద్యార్థి ఎంపిక కావడం తమకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. కడపలో ఉండే రాష్ట్ర స్థాయిలో స్పోర్ట్స్ స్కూల్‌లో అడ్మిషన్ కి ఎంపికైన గుంటి లీలాగౌతమ్ తమ పాఠశాలలో ప్రస్తుతం 4 వ తరగతి చదువుతున్నాడని తెలిపారు. పాఠశాల పిఇటి వెంకటేశ్వర్లు మాట్లాడుతు ఇలాంటి అవకాశం లీలా గౌతమ్‌కి రావడం ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి వారిని సన్మానించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపాలో చిచ్చురేపిన శంకుస్థాపన

### ఆ ఏడుగురితోనే రాజకీయంచేస్తారా..
### సమన్వయ కర్తను ప్రశ్నించిన కన్వీనర్ వర్గీయులు



**జలదంకి,సెప్టంబర్23,ప్రభాతవార్తః**జలదంకి వైకాపానేతలమధ్య సొసైటికార్యాలయ శంకుస్థాపన చిచ్చురేపింది.ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చర్యల్ని తప్పుపడుతు దిక్కారస్వరం వినిపించారు.ఆఏడుగురి నేతలతోనే రాజకీయం నెరుపుతారా అని నేరుగ ప్రశ్నించి సంచలనానికి తెరదీశారు.దుర్మార్గుడైన సొసైటి చైర్మన్ రవిరెడ్డి చెప్పిందే చేస్తారా పార్టీజండాలు బుజానమోసే ఎస్.సి,ఎస్.టి,బి.సి నేతలు,కార్యకర్తలను కాదని రవిరెడ్డి చెప్పినవిదంగ నడుచుకుంటు వర్గరాజకీయాలు నెరుపుతున్న వారికి ప్రాధాన్యత ఇస్తారా ఇలా అయితే తీవ్రంగ నష్టపోతారు ఇలాంటి చర్యలు పార్టీకి ఏమాత్రం సరైనదిశ కాదని ఆవేదన వ్యక్తంచేశారు.శనివారం మండలం నుంచి పెద్దసంఖ్యలో విచ్చేసిన మండలపార్టీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి వర్గీయులు స్థానిక పద్మావతి కళ్యాణమండపంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసిన వేములపాడు పంచాయతీనేత తక్కోలు నారాయణరెడ్డి,చామదల ఎం.పి.టి.సి భర్త పసుపులేటి ప్రసాద్,చోడవరం పంచాయతి నేత నరసారెడ్డి,గట్టుపల్లి ఉపసర్పంచ్ గుమ్మలంపాటి సుబ్బారావు తదితరులు రవిరెడ్డిపై నిప్పులు చెరిగారు.మండలపార్టీకి జీవంపోస్తూఅందరిని కలుపుకొనిపోతూ అహర్నిశలు పార్టీబలోపేతానికి కృషిచేస్తున్న జనార్ధన్‌రెడ్డి,ఇతరనేతలను ఆహ్వానించకుండ కేవలం ఏడుగురితో నే శంకుస్థాపన ఎలాచేస్తారని ప్రశ్నించారు.ఇది సరైన చర్యకాదని తప్పుబట్టారు.కన్వీనర్ చేవూరి జనార్ధన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలుచేస్తు గ్రూపులను ప్రోత్సహిస్తున్న రవిరెడ్డి పార్టీవిధేయుడా ఒక్కసారి ఆలోచించివుంటే బాగుండేదని అన్నారు.కనీసం స్థలదాత మండల సచివాలయాల కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ,జలదంకి సర్పంచ్ చలంచర్ల అనూరాధ,ఎం.పి.టి.సి పోట్లూరి వెంగమ్మలనైనా ఆహ్వానించి వుండాల్సిందికాదా ఎందు కని పిలవలేదు వారిద్దరు ఎస్.టిలని వివక్షచూపడమేకదా ఇదే మనపార్టీ విధానం అంటు ఆవేదన వ్యక్తం చేశారు.అయ్యా రవిరెడ్డిగారు పార్టీకి ఎవరు అన్యాయం చేస్తున్నారో తేల్సుకుందాం చర్చకు వస్తారా,వర్గ రాజకీయాలు నెరుపుతుంది తమరుకాదా,బహిరంగంగ తేల్చుకుంగాం రెడినా అంటు సవాల్‌విసి రారు.ఈసమావేశంలో పార్టీ జిల్లాకమిటి సభ్యుడు జ్యోతి రామచంద్రరావు,నేతలుఅన్నారెడ్డి చంద్రారెడ్డి,గుర్రం జగ్గయ్యానాయుడు,పులిమి బాబుల్‌రెడ్డి,జలదంకి సర్పంచ్ అనూరాధ,ఎం.పి.టి.సి వెంగమ్మ,చినక్రాక పంచాయతి నేతలు శివారెడ్డి,మాల్యాద్రిరెడ్డి,కేశవరం పంచాయతి నేతలు గద్దే బ్రహ్మయ్య,దివి కొండల్‌రావు,బోయిలపాడు నేతలు చంద్రారెడ్డి,సుబ్బారెడ్డి,గోపన్నపాళెం నేత గండు కృష్ణారెడ్డి,చామదల చినలక్ష్మీనరసారెడ్డి,ముస్లిం మైనారిటి నేత ఎస్.డి ఖాజారహంతుల్ల,పలువురు ఎం.పి.టి.సిలు,సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కాటం రవీంద్రారెడ్డా.. అవినీతి గురించి మాట్లాడేదీ?



**కలిగిరి, సెప్టెంబర్23, ప్రభాతవార్త;** కలిగిరి మండల వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కాటం రవీంద్రారెడ్డి చంద్రబాబు అవినీతిగురించి మాట్లాడుతున్నారని చదువుకునే పిల్లలసొమ్మురు. 40లక్షలు మింగేసిన రవీంద్రారెడ్డిని ఏమనాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కాకు మహేష్ ప్రశ్నించారు.శనివారం టిడిపి నాయకులు కలిగిరి మండల టిడిపి కార్యాలయంలో విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి స్కిల్ డెవలప్ మెంట్లో ఎక్కడా అవినీతి చేయలేదన్నారు.వైసిపి నాయకులే ఉద్దేశ్య పూర్వకంగా బాబును అక్రమంగా జైల్లో పెట్టారన్నారు.ఇక కలిగిరి మండల వైసిపి కన్వీనర్ చంద్రబాబునాయుడు అవినీతి చేశారని విలేకర్ల సమావేశంలో మాట్లాడారన్నారు.అసలు రవీంద్రారెడ్డి అవినీతిగురించి మాట్లడాలంటే కలిగిరి చెరువులో అవినీతి,కలిగిరి సొసైటీలో చేసిన అవినీతి, వింజమూరు యంయస్‌ఆర్ కళాశాలలో బాగస్తుడుగా ఉన్న రవీంద్రరెడ్డి విధ్యార్థులకొచ్చిన 40లక్షల స్కాలర్ షిప్పులు స్వాహాచేశారన్నారు.కళాశాలనేఇబ్బందులపాలు చేశారన్నారు.ఇక యంఎల్‌ఏ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విమర్శిస్తున్న రవీంద్రారెడ్డినిన్నటివరకూ ఆయన పక్కనే ఉండి ఇతరులను ఇబ్బందులు పెట్టలేదా?అని ప్రశ్నించారు.తెలుగుదేశం ఉదయగిరి ఇన్చార్జీ బొల్లినేని వెంకట రామారావు అని ఉదయగిరికి వైసిపి ఇన్చార్జీ ఎవరో మీరే తేల్చుకోండన్నారు.ఉదయగిరి టిడిపి ఇన్చార్జీ బొల్లినేని వెంకటరామారావు ఆదేశాలమేరకు కలిగిరి మండల టిడిపి కన్వీనర్ బిజ్జం వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశంలో చాగంటి జైరామిరెడ్డి, గంజాం రాగవేంద్ర,బొగ్గవరపు వేణు, శిద్దులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యికే కట్టుడు పళ్ళసెట్



**నెల్లూరు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 1వ తేదీన నారాయణ దంత వైద్య కళాశాలలో రూ.15వేలు ఖర్చు అయ్యే పూర్తి కట్టుడు పళ్ళ సెట్ కేవలం రూ.1000లకే అందిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అజయ్‌రెజినాల్డ్ పేర్కొన్నారు. శనివారం చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ దంత వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలి వయస్సులో దంత సంబంధిత సమస్యలు రావడం జరుగుతుందన్నారు. దంతాలు అందానికే కాదు ఆరోగ్యానికి కూడా అవసరమని, ఆహారం నమిలి మింగడం, మాటలు స్పష్టంగా రావాలన్నా దంతాలు ప్రధాన పాత్రను పోషిస్తాయన్నారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు నారాయణ దంత వైద్యశాల కట్టుడు పళ్ళ చికిత్సా విభాగం వారి ఆధ్వర్యంలో కట్టుడు పళ్ళుతీసి పెట్టుకునే సెట్‌నుఅతి తక్కువకే అందిస్తున్నట్లు వారు తెలిపారు. చిగుళ్ళ సమస్య, పంటి శస్త్రచికిత్సలు, తదితర సమస్యలకు నామమాత్రపు ఖర్చుతో ఈ శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందుకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఇతర వివరాలకు 7780473823 సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆ ఆసుపత్రి వైద్యులు కేవి సునీల్, దిలీప్‌నాగ్, నారాయణ మెడికల్ కళాశాల ఏజీఎం సీహెచ్ భాస్కర్‌రెడ్డి, టి పవన్‌కుమార్, వి వంశీకృష్ణ, కేపీ శరణ్‌బాబు, ఏఈ అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రామనారాయణరెడ్డితో విపిఆర్

**నెల్లూరు సెప్టెంబర్ 23, ప్రభాతవార్త-వైద్యం** మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డితో తెలుగుదేశం పార్టీ నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి శనివారం నగరంలోని సంతపేటలో ఉన్న రామనారాయణరెడ్డి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కాసేపు జిల్లా, నగర, రూరల్ నియోజకవర్గాల రాజకీయాలపై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## 25న "సింసం" ఆధ్వర్యంలో ఎస్పీబాలు పురస్కారాల అందజేత



**నెల్లూరు,సెప్టెంబరు23 ప్రభాతవార్త-విద్య** సింహపురి సంస్కృతి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 25న నగరంలోని స్థానిక పుం`మందిరలో ప్రఖ్యాతి గాంచిన ఎస్పీబాలసుబ్రమణ్యం కి నివాళి, ఆయన పేరుతో ఏర్పాటుచేసిన పురస్కారాల ను ప్రముఖులకు అందజేయనున్నామని కార్యక్రమ నిర్వహకులు రాంజీ, ఎన్.బల రామయ్య నాయుడులు తెలిపారు. శనివారం నగరంలోని టౌన్ హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గత అనేక సంవత్సరాలుగా తమ సమాఖ్య ఆధ్వర్యంలో సాహితీ రంగానికి సేవలు అందిస్తున్నామన్నారు. నెల్లూరు నగరానికి చెందిన ప్రసిద్ద గాయకులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకి నివాళులుగా ప్రతి ఏటా పురస్కారాలను అందిచ`టం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎస్పీ బాలుకి 40 మంది బాల గందర్వులచే నివాళులు అర్పించటం జరుగుతుందని అనంతరం విశిష్ట సేవలు అందించిన పా టూరి శ్రీనివాసులు, బెల్లంకొండ రాజ్‌కుమార్‌లకు ఎస్పీబాలు అవార్డులను ప్రధానం చేయనున్నామని తెలిపారు.ఈ సందర్భంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా రాష్ట్రంలోని ప్రముఖులు ప్రముఖులతోపాటూ జిల్లాలోని రాజీయ ప్రముఖులు సినీ హీరో సుమన్ పాల్గొనటం జరుగుతుందన్నారు. అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.






## మనుబోలులో భారీ వర్షం



**మనుబోలు,సెప్టంబర్23,ప్రభాతవార్తః**మనుబోలులో శుక్రవారంరాత్రి భారీవర్షం కురిసింది.ఉరుము లు,మెరుపులు అరగంటసేపు మండలప్రజలను బెంబేలెత్తించాయి.దీనికితోడు వానదంచికోట్టింది.వినాయక నిమజ్జనానికి వెళ్ళినవారకి ఉన్నపళంగ కురిసిన వాన,ఉరుములు,మెరు పులు హడలెత్తించాయి.శనివారం ఉదయం ఎక్కడచూసిన కాలువలు,గుంటల్లో బారీగ నీరుచేరాయి.

## జట్లకొండూరులో జగనన్న భూరక్షసర్వే



**మనుబోలు,సెప్టంబర్23,ప్రభాతవార్తః**మండలంలోని జట్లకొండూరులో శనివారం ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ ఆధ్వర్యంలోజగనన్న భూసర్వే నిర్వహించారు.భూములలో వున్న రైతులకు వారుచేసుకుంటున్న పొలాలకు భూహక్కులు కల్పించేందుకు ఈసర్వే చేసినట్లు ఉపసర్పంచ్ తులసీరామ్‌యాదవ్ తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ మంత్రివర్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాగ్రామాన్ని అన్నివిదాలుగ అభివృద్ధిచేస్తున్నందుకు తులసీరామ్‌యాదవ్ మంత్రికి ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.సర్వేయర్ రాజ రైతులకు జగనన్న భూరక్షలో రైతు లకు పొలాలు చూపించారు.

## మల్దేవ్ కాలువ అభివృద్ధి నిధులు ఎమైయ్యాయో తెలపాలి

### - నిలిచిపోయిన పనుల తక్షణం ప్రారంభించాలి



**నెల్లూరు,సెప్టెంబరు 23 ప్రభాతవార్త-విద్య** జిల్లాలో వందలమంది రైతులకు తాగు,సాగు నీరు అందిస్తున్న మల్దేవ్ కాలువ అభివృద్ధి పనులు అర్థాంతరంగా ఆగిపోవటం విచారకరమ ని, కాలువ అభివృద్దికి ప్రభుత్వం విడుదల చేసిన నిధులు ఏమైయ్యాయో స్వేతపత్రం విడుదల చేయ్యాలని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఆయన శనివారం డ్రైనేజీశాఖ డిఈ మధు కి ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గునుకుల కిషోర్ మాట్లాడుతు రానున్న ఎన్నికల్లో అధికారం పొందటం కోసం వైకాపా ప్రభుత్వం కుటిల రాజకీయాలు పన్నుతూ ,ప్రజలకు సాధ్యం కాని వాగ్దానాలు ఇస్తుందన్నారు. మాజీ జలవనరుల శాఖమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మల్దేవ్ కాలువ అభివృద్దికి కోసం కోవ్వూరు నియోజకవర్గానికి సుమారు 75కోట్ల రూపాయాలు విడుదల చేయటం జరిగిందని స్వయానా పార్టీ నాయకులే బాకాలు ఊదుకోవటం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం కాలువ నిర్మాణ పనులు అర్థాంతరంగా కాంట్రాక్టర్ నిలుపుదల చేయటంతో వారిని ప్రశి ్నంచగా తమకు చేసిన పనులకు బిల్లులు వస్తే తప ్ప మిగిలిన పనులు పూర్తి చేసేది లేదని తెగేసి చెప్పారన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా కాంట్రాక్టర్లుకు నిధులు అందలేదంటే ఈ నిధుల వినియోగంపై ప్రజలకు అనేక అనుమానాలు వస్తున్నాయని, వెంటనే అధికారులు దీనిపై స్పందించి నిధుల వినియోగానికి సంభందించి స్వేతపత్రం విడుదల చేయ్యాలని కోరారు. అలాగే కాంట్రాక్టర్‌కు నిధులు అందేలా చేసి కాలువ పనులు పూర్తిచేయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన



**సైదాపురం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** మండల పరిధిలోని కలిచేడు, తుమ్మలతలుపూరు సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపిడీఓ మీసాల వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. గ్రామ సచివాలయ సిబ్బందితో సర్వేపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే గ్రామాల్లో పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

## నాడు-నేడు పనులు పరిశీలించిన ఏపీసీ ఉషారాణి



**తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** మండలంలోని కోడూరు బాలయోగి గురుకుల బాలికల కళాశాలలో నాడు-నేడు కింద జరుగుతున్న పూర్తి చేసిన పనులను శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు- నేడు కింద పనులు స్కూల్ మేనేజ్‌మెంట్ ఫండ్ ఆధ్వర్యంలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత పనులకు విడుదలైన నిధులు ఎస్ఎంఎఫ్ కమిటీ ద్వారా చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొదటి ఫేసులో 1057 పనులు పూర్తి చేసి చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. తోటపల్లిగూడూరు మండలంలో నాడు-నేడు కింద రెండో ఫేసులో చేపట్టిన 43 పనులలో దాదాపు 80 శాతం పూర్తి అయినట్లు ఇంజనీరింగ్ అధికారులతో తెలిపారు. ప్రస్తుతం బాలికల గురుకుల కళాశాలకు రూ.8లక్షల నిధులు ఎస్ఎంఎఫ్ కింద విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ తెలిపారు. సర్వశిక్ష అభియాన్ ఏపీసీతో పాటు ఏపీఈడబ్ల్యు ఐడీసీఈఈ శ్యాంసుందర్, ఏఈ ఏవీ కృష్ణయ్య, ఎంఈఓ-2 డిజయ రామానాయుడు, ఎస్ఎంఎఫ్ చైర్మన్ ముక్కంటి నరసింహ, ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి సభ్యుడుగా మూరంరెడ్డి



**బుచ్చి సెప్టెంబర్ 23 ప్రభాతవార్త** లీగల్ సర్వీస్ అథారిటి జిల్లాలో ఎంపిక చేయుచున్న మోడల్ విలేజ్ కమీటిలోని కి ప్రపంచ మానవ హక్కుల సంఘం చైర్మన్ మూరంరెడ్డి సుబ్బారెడ్డిని సభ్యుడుగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతు మానవహక్కుల సంఘం ఆద్వర్యంలో హక్కులపై అవగాహన కార్యక్రమలు నిర్వహించడంతో పాటు నిత్యం పేద ప్రజలకు సేవ చేస్తు ,అబాగ్యలను ఆదుకోవడంలో చేస్తున్న కృషిని గుర్తించి జిల్లా జడ్జి సి.యామిని నన్ను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి కమీటి ఆద్వర్యంలో జరిగే మోడల్ విలేజి కమీటిలో సభ్యుడుగా ఎంపిక చేసినందుకు జిల్లా జడ్జి,లీగల్ సర్వీస్ అథారిటి చైర్మన్ యామినికి ,జిల్లా లీగర్ సర్వీస్ అథారిటి సెక్రటరీ కె .వాణికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నాపైన నమ్మకంతో వారు నాకు ఇచ్చిన బాద్యతలను పూర్తి స్థాయిలో ప్రజలకోసం వినియోగిస్తానని ఆయన తెలిపారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్ధవంతంగా తీసుకెళ్లాలి




**కావలి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని సమర్ధవంతంగా అధికారులు ప్రజలలోకి తీసుకెళ్లాలని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డు సచివాలయంలో శనివారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన వార్డులో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాలు అందరికి అందే విధంగా అధికారులు కృషి చేయాలని ఆదశించారు. ఏదైనా సమస్యలు వున్నా నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అందజేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్, మున్సిపల్ డిఇ పి.సాయిరామ్, ఎఇ షైని, వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా ప్రజల్లోకి వస్తారు




**కావలి, సెప్టెంబరు 23 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సత్యహరిశ్చంద్రుడిలా పరీక్షను ఎదుర్కొంటున్నాడని కడిగిన ముత్యంలా ప్రజల్లోకి వస్తారని పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ తెలిపారు. నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ని నిరసిస్తూ పసుపులేటి సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కావలి ట్రంకురోడ్డులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం నుండి ట్రంకురోడ్డు మీదుగా ఉదయగిరి బ్రిడ్జి వద్దకు చేరుకుంది. ఈ ర్యాలీలో ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొనడంతో కావలి ట్రంకురోడ్డు కిటకిటలాడింది. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా రాజారెడ్డి రాజ్యాంగం వద్దు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం కావాలంటూ ర్యాలీలో పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పసుపులేటి సుధాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తుందని దుయ్యబట్టారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగం కోసం మనమంతా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా అన్న చందంగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలలో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టలేకుండాపోతుందన్నారు. కావలి నియోజకవర్గంలో ఇసుక,గ్రావెల్, మట్టిని అక్రమంగా తరలిస్తూ దోచుకుంటున్నారన్నారు. అవినీతి, అక్రమాలు చేసే అక్రమార్కులకు బుద్దిచెప్పే రోజు త్వరలోనే వుందని హెచ్చరించారు. నారా చంద్రబాబునాయుడు విడుదలయ్యేంత వరకు నిరసన ర్యాలీలో కొనసాగుతూనే వుంటాయన్నారు. ఈ ర్యాలీలో అడుగడుగునా పసుపులేటి సుధాకర్‌ని దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ ర్యాలీలో పసుపులేటి అభిమానులు, ప్రజలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమమే ధ్యేయంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన



**సైదాపురం, సెప్టెంబరు 23, ప్రభాతవార్త** రాష్ట్రంలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 45కోట్లతో చేపడుతున్న సైదాపురం-దేగపూడి రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి కలిచేడు గ్రామంలో శనివారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజల ఇంటి దగ్గరకే వెళ్లి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటూ ప్రజల అభివృద్ధి కొరకు అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని తెలి పారు. రానున్న ఎన్నికలకు సంబంధించి ఈ ప్రాంతం నుండే వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల శంఖారావం మొదలుపెడుతున్నానని అన్నారు. నాయకులు, కార్యకర్తలు విభేధాలు లేకుండా సమన్వయంతో ముందుకు వెళ్లి గెలుపే లక్ష్యంగా పార్టీ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. సైదాపురం మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి, నిర్మాణ పనులను, అదే విధంగా సైదాపురం-దేగపూడి రోడ్డు నిర్మాణ పనులు సంబంధించిన కాంట్రాక్టర్లు, అధికారులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు మన్నారపు రవికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసరాజు, ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు శివకుమార్, సీనియర్ నాయకులు కమలపూడి సుబ్బారెడ్డి, నందిమండలం అభిరాజ్, శేఖర్‌నాయుడు, శ్రీనివాసులురాజు, ఈశ్వర్‌రాజు, భాస్కర్‌రావు, రాధాకృష్ణారెడ్డి, వరప్రసాద్, రామ్‌గోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.